# అపస్వరాలు

ప్రతి మానవుని జీవితంలో అనుదినం యెంతోమంది వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. అందులో కొంతమంది వ్యక్తుల తాలూకు అనుభవాల మలినచ్ఛాయలు మాత్రమే మస్తిష్కంలో మసకగా కమ్ముకొని వుంటాయి. అవకాశం దొరికినప్పుడు ఆ మసకతెరలు తొలిగిపోయి మళ్లీ స్పష్టంగా కళ్లకు కన్పిస్తాయి.

నా హాస్టలు జీవితంలో తటస్థపడ్డ ఓ వ్యక్తి యెప్పుడూ నా కళ్లకు కన్పిస్తూనే వుంటుంది. ఎప్పుడూ దేన్నో వెతుకుతూండే ఆ లోతైన కళ్లు, దాదాపు పైపెదవి వరకూ వంగివున్న ఆ పొడవైన ముక్కు, చిన్నగడ్డం, ఆ నల్లని లావాటి శరీరమూ ఎప్పుడూ నా కనుపాపల్లో కదులుతూ వుంటాయి.

లలిత హాస్టలుకు వచ్చిన మొదటిలోనే అందరి దృష్టినీ యిట్టే ఆకర్షించింది. దానికి ముఖ్యకారణం ఆసాధారణమైన ఆమె చూపులే. ఆమె రూపం అసహ్యంగా లేకపోయినా, మొత్తం మీద వెగటు కలిగించేదిలా వున్నది. ఆమె వేషం మాత్రం బాగా డబ్బు గలదనే విషయాన్ని రుజువు చేస్తుంది.

మా వార్డెన్ ఆ అమ్మాయిని నా రూములోనే వుంచింది. ఒకే రూములో వున్నా రెండు రోజుల వరకూ ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. మిగతా విద్యార్థినులు కూడా దూరదూరం నుంచే ఆ అమ్మాయి రూపాన్నీ, బెదురుచూపులనూ వర్ణించుకుంటూ, నవ్వుకొంటూ వెళ్లిపోయేవారు. అందులో నాక్కూడా భాగం లేకపోలేదులెండి! ఆ రెండు రోజులూ గదిలో దిగాలుపడి కూర్చున్నది. ఆమె కళ్లనుండి ఎవరికీ అర్థం కాని బాధ తొంగి చూస్తూండేది. చివరకు జాలివేసి నేనే మాట్లాడించాను. బాగానే మాట్లాడింది.

వారం రోజుల్లోనే అందరూ మమ్మల్ని గాఢస్నేహితులంటూ ఎగతాళి చేయ ప్రారంభించారు. ఎప్పుడూ నన్ను వదలకుండా నాతోనే తిరిగేది. నేను యింకొకరితో మాట్లాడటం ఆమెకు యిష్టముండేది కాదు. హాస్టల్లోని ప్రతివారి వయసూ, వారికి పెండ్లి అయినదీ, లేనిదీ, అయితే భర్త ఏం చేస్తుంటాడో, ఎలా వుంటాడో, యిలాంటివే లక్ష ప్రశ్నలు వేస్తూ నా ప్రాణం తీస్తుండేది. ఆమె మాట్లాడే ప్రతి వాక్యంలోనూ అమాయకత వుట్టిపడుతుండేది. కోపం వచ్చి విసుక్కుంటే ఏడ్చేది. మళ్ళీ జాలివేసి నేనే పలకరించేదాన్ని. తనను అడగకుండానే తన వయస్సు పందొమ్మిదనీ, లావుగా వుండటంవల్ల పెద్దదానిలా కనిపిస్తాననీ చెప్పేది. తనతో మాట్లాడిన ప్రతివారికీ లలిత చెప్పే మొదటి వాక్యమదే!

హాస్టల్లో ఎవరి కోసం విజిటర్సు వచ్చినా లలిత కళ్లలో పడకుండా పోలేరు.

ముఖ్యంగా ఆ వచ్చినవారు మగవాళ్లయితే ఆమె ఆ ప్రాంతాల్లోనే తారట్లాడుతూ వుంటుంది. అప్పటి ఆమె చూపులు చూసినవాళ్లకే తెలుస్తుంది. కాని, చెప్పటం చాలా కష్టం ఇంటి యజమాని కొడుకు రెండు చేతుల్లో లడ్లు తెచ్చుకొని బొక్కుతున్నాడనుకోండి. అప్పుడు ఆ యింట్లో అంట్లు తోమే ఏ మాలచ్చి కొడుకో, అదే వయసులో వున్నవాడు చూసే చూపులే అవి, ఆ, సరిగ్గా అలాగే... కొంచెం కొంచెం తృప్తితో, కొంచెం కొంచెం ఏహ్యాభావంతో కొంతసేపు అలా చూసి మళ్లీ ఎదుటివారు ఏదో అవినీతికార్యం చేస్తున్నట్లు, లావాటి ఆ కింది పెదవిని యింకొంచెం కిందకు వ్యాపింపజేస్తూ, ముఖం తిప్పుకొని వెళ్లిపోయేది. మళ్ళీ- ఎక్కువసేపు గదిలో వుండలేకపోయేది. మధ్య మధ్య ఆ వచ్చిన వారు వెళ్లారో లేదోనని తొంగి చూస్తుండేది.

ఆమెతో స్నేహం ఒక నెల రోజుల్లోనే నాకు మొహం మొత్తింది. వారానికి ఒకరు చొప్పున మా హాస్టల్లోని అందరితో స్నేహం చేసింది. కొత్తవాళ్లు దొరగ్గానే పాతవాళ్లతో మాట్లాడేది కాదు. వాళ్లలో ఎవరైనా ఎదురుపడితే శత్రువును చూసినట్లు బెదురుచూపులు చూస్తూ తప్పుకుపోయేది. తన నీడను చూసి తనే భయపడుతున్నట్లు ప్రవర్తించేది!

తనతో స్నేహం చేసిన ప్రతివారికి మిగతా అంతా నీతిదూరులని, దొంగలని, అందువల్ల వాళ్ళ స్నేహం మానేశాననీ చెప్పింది. ఇంకా ఒకరిమీద యింకొకరికి యెన్నో అబద్ధాలు చెప్పింది. చివరికి హాస్టల్లోని విద్యార్థినులందరికీ లలిత అంటే అసహ్యం, కోపం కూడా కలుగుతున్నాయి. కాని, ఆమెను మా వార్డెను చాలా ప్రేమగా చూడటంవల్ల మేమెవరమూ ఆమెను ఏమనటానికీ సాహసించలేకపోయాము.

క్రమంగా హాస్టల్లో చిన్నచిన్న వస్తువులు కన్పించడంలేదు. నా రూములో సబ్బు దగ్గర నుండి శీకాయ వరకూ పోతున్నవి. దీనికంతా కారణం లలితేనని మాలో కొంతమందికి నమ్మకం కలిగింది. ఎలాగైనా లలితను దొంగగా రుజువు చేసి మా కక్షను తీర్చుకోవాలనుకున్నాము. అందులో ముఖ్యపాత్ర నాదనే చెప్పాలి.

రాత్రుళ్లు గదిలో పాటలు పాడుకుంటూ, మధ్య మధ్య కొంచెం సేపు నవ్వుతూ, కొంచెంసేపు ఏడుస్తూ వుండేది. ఇదంతా చూస్తున్నకొద్దీ ఆ అమ్మాయికి పిచ్చేమోనని భయం కలిగేది. చిట్టచివరకు ఆమెతో ఆ రూములో ఒంటరిగా పడుకోవాలంటేనే భయం కలిగేది. ఆమెను ఆ రూమునుండి ఎలాగైనా వెళ్లగొట్టాలి... ఉపాయం ఆలోచించాను.

ఒకరోజు ఆమె తన పెట్టెను తీస్తున్నప్పుడు వెనుకనుండి జాగ్రత్తగా పరిశీలించాను. అందులో వారం రోజుల నుండి కన్పించని నా పుస్తకా (గుడ్‌ఎర్త్)న్ని చూశాను. ఇంకేం? నా పాచిక పారినట్లేనని సంతోషించాను. ఆ రాత్రి నేనూ, ఇంకా యిద్దరు స్నేహితురాళ్లూ గదిలో ప్రవేశించాము. ముగ్గురినీ వొక్కసారిగా చూసి లలిత బెదిరిపోయింది. మేము ఆమెను పెట్టెతెరిచి చూపించమన్నాము. మేమునుకొన్నదొకటీ, అక్కడ జరిగిందొకటీ. సిగ్గుపడుతుందో లేక ఎదురుతిరిగి పోట్లాడుతుందో అనుకున్నాము. కాని, అదేమీ జరగలేదు. మా వాక్యం ముగిసీ ముగియకముందే "అయ్యో! అమ్మో!" అంటూ గావుకేక పెట్టింది. ఆ కేకతో హాస్టలంతా ప్రతిధ్వనించింది.

హాస్టలు పిల్లలంతా మా చుట్టూ చేరారు. మా వార్డెను కూడా పరుగెత్తుకొచ్చింది. లలిత జుట్టు పీక్కుంటూ, తలను గోడకు కొట్టుకుంటూ, పెడబొబ్బలు పెట్టి ఏడుస్తూవుంది. మేము ముగ్గురమూ అపరాధునుల్లాగ కొయ్యబారి నిల్చుండిపోయాము.

మా వార్డెను మిగతా అందర్నీ వెళ్లి తమ పనులు చూసుకోమని ఆజ్ఞాపించింది. లలితతో ఒక్క మాట కూడా మాట్లాడకుండా, మా ముగ్గుర్నీ తన వెంటరమ్మని సైగ చేసి తన రూమువైపుగా వెళ్లింది. రాబోయే ప్రమాదాన్ని ఊహించుకుంటూ, వణుకుతున్న కాళ్లతో ఆమెను వెంబడించాము.

వార్డెను అడగ్గా జరిగిన విషయం అంతా చెప్పాము. ఆమె తాపీగా కూర్చుని అంతా విన్నది. ఆమెకు మామీద ఏమాత్రం కోపం ఉన్నట్టు కనిపించలేదు. మా గుండెలు కొంతవరకు కుదుటపడ్డాయి. కాని ఆ ముఖంలోని విషాద ఛాయల్ని చూస్తున్న మాకు ఆశ్చర్యం కలిగింది.

మెల్లగా ఆమె చెప్పటం ప్రారంభించింది: "హాస్టల్లోని ప్రతివారూ ఆమె వికృతమైన ప్రకృతిని అసహ్యించుకుంటున్నారని నాకు తెలుసు. మీరేకాదు– ఆమె బెదురుచూపుల చాటున దాగివున్న చితికిపోయిన హృదయాన్ని చూడలేని ఏ ఒక్కరూ, అపస్వరాలు తప్ప పలకని ఆమె ప్రకృతిని అసహ్యించుకోకుండా వుండలేరు. ఆమె దొంగతనాలు చేస్తుందని నాకు తెలుసు. ఆమె దొంగచూపుల అడుగున ఘనీభవించివున్న మూగవేదనను అర్థం చేసుకోలేని ఏ ఒక్కరూ, ఆమెను సానుభూతితో చూడలేరు.

"మీ అందరిలాగా ఆమెను నేను అసహ్యించుకోలేకపోవటానికి కారణం... చిన్నప్పటినుండి ఆమె ఎటువంటి నిర్దాక్షిణ్య విషపూరిత వాతావరణంలో పెరిగిందో తెలియటమే! ఇలా అసాధారణంగా ప్రవర్తించే ప్రతివారూ, ఎప్పుడూ ఏదో మానని గాయం వల్ల తీరనిబాధ అనుభవిస్తూంటారు. వారి హృదయాలు ఏదో తీరని అసంతృప్తితో విలపిస్తూ వుంటాయి. ఎప్పుడూ దేన్నో పొందాలని ప్రయత్నిస్తూ పొందలేక జీవితంలో నిరాశ, పరాజయం తప్ప ఎరుగని వారి అసంతృప్తి హృదయాలు తృప్తిని రుచిచూడ తహతహలాడుతుంటాయి. ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ తమకు చెందిన దేన్నో తమకు కాకుండా చేస్తున్నట్లు బాధపడుతూ వుంటారు. తమ బాధకు ప్రతిఫలంగా యితరులను బాధపెడుతూ తద్వారా దాన్ని తీర్చుకోవాలని ప్రయత్నిస్తూ వుంటారు. ఒక్కొక్కప్పుడు అలా చేస్తున్నామని వారికే తెలియకపోవచ్చు కూడా."

ఊపిరి పీల్చకుండా వుద్రేకంతో యింతవరకూ చెప్పి చటుక్కున ఆగిపోయిన వార్డెను ముఖంలోకి చూశాము ఆదుర్దాగా. ఆమె బరువుగా, దీర్ఘంగా వూపిరి పీల్చి మళ్లీ ప్రారంభించింది:

"కుష్ఠురోగి పుండ్ల నుండి కారే చీమూ, రక్తమూ జుగుప్సాకరమైనవే కానీ ఆ పుండ్లను బాగా కడిగి మందువేసి కట్టుకడితే రోగవిముక్తి కలిగిందని చెప్పలేము. అలాగే యిలాంటివారు కొందరు తమ వికృతిని ప్రదర్శిస్తూ నలుగురిచేతా 'ఛీ!' అనిపించుకుంటారు. ఇంకా కొంతమంది లోలోపలే కుమిలిపోతూ, అవకాశం చిక్కినప్పుడు సమాజానికి చీడపురుగుల్లాగ తయారవుతారు. దీనికంతా కారకులెవరని బహుశా మీరు అడుగుతారు. ఇలాంటి వారి జీవిత పతనానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ, తెలిసో తెలియకో బాధ్యులే. అలాంటి అదృష్టహీనుల్లో లలిత ఒక్కరై.

"నేను బీటీ పూర్తి చేసిన సంవత్సరమే కుంభకోణంలో ఒక ఆడపిల్లల హైస్కూల్లో ఉపాధ్యాయినిగా చేరాను. అప్పుడు మేము లలితా వాళ్లింట్లోనే ఒక భాగంలో అద్దెకు వున్నాము. అప్పుడు లలిత వయస్సు మూడు సంవత్సరాలు. ఆమెకు పన్నెండు సంవత్సరాల

అన్న ఒకడు వున్నాడు. ఆ తల్లిదండ్రులకు ఈ ఇద్దరే సంతానం. వాళ్ల నాన్న బట్టల వ్యాపారంలో చాలా డబ్బు సంపాదిస్తుండేవారు. తల్లీ, తండ్రీ ఇద్దరూ చాలా మంచివారు. కొద్దిరోజుల్లోనే మేమూ, వాళ్లూ చాలా సన్నిహితంగా వుండేవాళ్లము. లలిత ఎప్పుడూ నా దగ్గరే వుంటూండేది.

"తల్లీ, తండ్రీ లలితను చాలా ముద్దుగా పెంచేవారు. ఆ పిల్ల ఆడింది ఆట, పాడింది పాటగా వుండేది. ఇంట్లో కూతురు అడగాలే కానీ కొండ మీద కోతినైనా సరే తెచ్చి ఇచ్చేవాడు ఆమె తండ్రి. ప్రొద్దస్తమానమూ వాకిట్లో కూర్చొని వచ్చేపోయే ప్రతి వస్తువూ కొనిపిస్తూ వుండేది. నిజం చెప్పాలంటే, డబ్బంతా అలా వ్యర్థంగా ఖర్చు పెడుతూవుంటే నాకే కష్టమనిపించేది. పెద్దవాళ్ల స్వభావం తెలిసిందేగా ఇలాంటి విషయాల్లో! ఒకరోజు మా అమ్మ అనేసింది వాళ్లముందు. 'అబ్బరాన బిడ్డ పుడితే గడ్డపలుగుతో ముక్కుచెవులూ కుట్టారట. ఎంత అలపం పోతున్నారమ్మా! పిల్ల అడిగితే మాత్రం అయిందానికీ, కాని దానికీ అట్టా డబ్బు పాడుచేసుకుంటారా?' అంటూ బుగ్గ నొక్కుకున్నది. దానికి ఆమె తల్లీ, తండ్రీ బాధపడ్డారు. నేను మా అమ్మను కోప్పడ్డాను. పైగా దారినపోయేదాన్ని నెత్తిన పెట్టుకుంటున్నందుకు, ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆ అమ్మాయి ఎంత ముద్దుగా పెరిగిందో తెలియజేయటానికే.

"ఆ పిల్ల ఐదో సంవత్సరంనుండే అన్ని కష్టాలూ ప్రారంభమయేయి. ఐదో సంవత్సరంలోనే అమ్మ కరవైంది. ఆరు నెలలన్నా తిరక్కుండానే ఆమె తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. అంత ప్రేమగా చూసే ఆ తండ్రీ అందరు మగాళ్లలాగానే మారిపోయాడు పడుచుభార్య రాగానే.

"ఆమె సవతితల్లి పేరు కమల. చాలా అందంగానే వుండేది. అన్ని విషయాల్లో చాలా మంచిదనే చెప్పాలి. కాని ఆమె తల్లిదండ్రులు డబ్బుకు ఆశపడో, లేక ఈ రోజుల్లోని యువక శిఖామణులకు కట్నాలు చెల్లించుకోలేకనో, బంగారంలాంటి పిల్లను ఈ నలభై ఏళ్లవాడికి అంటగట్టారు.

"అలాంటి స్థితిలో వున్నవారి మనస్సు ఎంత అసంతృప్తితో బాధపడుతూ వుంటుందో మనం ఊహించుకోవచ్చు. ఆమె అసంతృప్తి హృదయానికి ఎరగా దొరికింది ఐదు సంవత్సరాల పసిబిడ్డ లలిత.

"లలిత ఏదో ఒక విషయంలో రోజుకు ఒక్కసారైనా దెబ్బలు తినేది. తండ్రి చూస్తూ ముభావంగా వుండేవాడు. అంతకు ముందున్న అతనిలోని ఆ పితృహృదయం ఏమైందా అని బాధపడేదాన్ని, ఇదంతా చూస్తున్న నేను. కాని కన్నతండ్రే తటస్థంగా వున్నప్పుడు నేను మాత్రం ఎలా కల్పించుకోగలను. పరాయిదాన్ని?

"కంటిపాపలాగ ఎంతో జాగ్రత్తగా ముద్దుగా పెరిగిన లలిత జీవితం ఒక్కసారిగా తలక్రిందులైంది. ఈ మార్పును ఎదుర్కొనే శక్తి ఆ అమాయక పసిహృదయంలో ఇంకా రాలేదు. ఎప్పుడూ దెబ్బలు తినని ఆమె వీపు ఇప్పుడు దెబ్బలతో కాయ కాస్తూంది. అతి సుకుమారంగా పెరిగిన ఆమె చిన్న హృదయం, లేతమొగ్గలాంటి కోమల హృదయం వికసించకుండానే సవతితల్లి ఇనుప చేతులతో నిర్దాక్షిణ్యంగా నలిగిపోయింది. ఆమెలోని ఆత్మ నిద్రపోయింది. చైతన్యం మొద్దుబారిపోయింది.

"రోజు రోజుకూ లలిత దెబ్బలకుకూడా వెరవకుండా పోయింది. డబ్బు

దొంగతనంగా తీసుకెళ్ళి బెలూన్లు అవీ కొనేది. తన కూతురు దొంగతనం చేసిందని విన్నప్పుడు ఆ తండ్రిలోని సంస్కారపూరిత హృదయం కోపంతో కంపించిపోయేది. ఆరోజు తల్లీ, తండ్రీ ఇద్దరూ కలిసి ఆ పిల్లను చితక్కొట్టేవారు. ఆ రాత్రంతా నిద్రలోకూడా ఏదో పలవరిస్తూ వెక్కిళ్లుపెట్టే ఆ పిల్లను తలుచుకుంటే, ఈరోజుకు సైతం నా గుండె తరుక్కుపోతుంది.

"ఒక సుదినం చూసి ఆమెను స్కూలుకు పంపించారు. ఆరోజు నాకు చాలా సంతోషం కలిగింది. ఈ మధ్య నాతోకూడా లలితను మాట్లాడనిచ్చేది కాదు ఆమె పినతల్లి కమల. నా సానుభూతి ఆ అమ్మాయిని ఇంకా చెరుపుతుందని ఆమె భయం కాబోలు! కనీసం ఇకనుండైనా తన తోటిపిల్లల్తో, ఉపాధ్యాయుల ఆదరంలో రోజంతా గడుపుతుంది కదా అనుకున్నాను. కాని మనదేశంలో, పిల్లల మనస్తత్వాన్నీ, వారి వాతావరణాన్నీ అర్థం చేసుకొని వారి లోపాలను సానుభూతితో, ప్రేమతో, ఓర్పుతో తీర్చగల ఉపాధ్యాయులు లేకపోవటం నిజంగా మన దురదృష్టమనే చెప్పాలి.

"క్రమంగా స్కూల్లో లలిత మొద్దు, మొండి, దొంగపిల్లల్లో ఒక పిల్లగా లెక్కలోకి వచ్చింది. మాస్టరుగారి బెత్తం రోజుకు ఒక్కసారైనా ఆ మొండిపిల్ల వీపుమీద నాట్యం చేసేది. క్రమంగా ఆమెలోని మానవత్వం పశుత్వంగా-మూగపశుత్వంగా మారుతూంది. పశువును కొడుతూ పొండి, అది సహిస్తూ పోతుంది. సరిగ్గా లలితకూడా అలాగే తయారైంది.

"దెబ్బలతో ఆమె శరీరం ఎంత కొయ్యబారిపోయిందో, ప్రతివారి తిరస్కారాలతో కూడిన మాటలతో ఆమె హృదయంకూడా అంత మొద్దుబారిపోయింది. చిన్నపిల్ల దగ్గరనుండే ఆమె సవతితల్లి 'ముదిముండ' అనీ, 'ఎన్నేళ్లు వస్తేనేమి, నీకు వచ్చినయి..., ఆ పం.ది.కీ వచ్చినయి. నీతా, జాతా-చీమా రక్తమా?' అని తిడుతూంటే నాకెంతో బాధగా వుండేది. కాని లలిత మాత్రం తనను కాదన్నట్లు తుడుచుకుపోయేది.

"ఇదంతా చూస్తూ వాళ్ల అన్న ఎంతో బాధపడుతుండేవాడు. చాటు చాటున ఏడ్చి కళ్లు తుడుచుకొనేవాడు. కాని అతను మాత్రం ఏం చేయగలడు? అతను పెద్దవాడు కావటం వల్లనో లేక మగపిల్లవాడు కావటం వల్లనో, ఎందుచేతనో నేను సరిగా చెప్పలేను కాని, మొత్తంమీద కమల మాత్రం అతన్ని ప్రేమగానే చూసేది. బి.ఏ.లో ప్రెసిడెన్సీకి ఫస్టు వచ్చాడు. అందువల్ల అతన్ని గవర్నమెంటే అమెరికాకు పంపింది. అతను అమెరికా వెళ్లేనాటికి లలితకు పదకొండు సంవత్సరాలు.

"ఆ సంవత్సరంలోనే లలిత స్కూల్లో ఏదో దొంగతనం చేసిందని డిస్మిస్ చేశాడు హెడ్మాస్టరు. ఆ రోజునుండి ఆమె జీవితం ఇంట్లో ఇంకా దుర్భరమైంది. నాలుగు గోడలమధ్య అడకత్తెరలోని వక్కలాగ గడిచిపోతోంది ఆమె జీవితం. సవతితల్లి చూడకుండా మధ్య మధ్య నా దగ్గరకు వస్తూండేది. కర్మంచాలక చూసిందా, ఆరోజు లలితకు మూడిందే ఆమె చేతిలో!

"లలిత జీవితంలో పదహారు హేమంతాలు దాటిపోయాయి కాళ్లీడ్చుకుంటూ భారంగా. ఇక్కడినుండి లలిత జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది. ఎడారిలాగ ఎండిపోయిన ఆమె జీవితవనంలోకి ఒకే ఒకసారి పాదం పెట్టాడు వసంతుడు. కాని ఇప్పుడు ఆ పాదం తాలూకు చిహ్నం మాత్రమే వుండిపోయింది. బహుశ పొగచూరిపోయిన

ఆమె హృదయం ఆ పాదచిహ్నాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ వుండవచ్చు- 'ఎడారిలాగ నిరంతరం మండుతుండే నా హృదయంలో ఒక్క ఆశాపుష్పం వికసించదా? జీవితాంతం ఎండమావుల భ్రమలో పడి, చివరికి అసంతృప్తితో అంతం కావలిసిందేనా?' అంటూ.

"మా పెదనాన్న కొడుకు మద్రాసులో బి.ఏ. చదువుతుండేవాడు. అతను సున్నితహృదయం, వున్నతాదర్శాలు గలవాడు. ఆ సంవత్సరం వేసవి సెలవులు కుంభకోణంలో గడపాలని వచ్చాడు. నా ద్వారా లలిత విషయమంతా విన్నాడు. విన్నంతసేపు కన్నీరు కార్చాడు.

"లలిత సాధారణంగా మధ్యాహ్న సమయాల్లో మా ఇంటికి వస్తూండేది. అప్పుడు ఆమె తల్లిదండ్రులు నిద్రపోతూండేవారు. క్రమంగా రామారావు, లలిత మాట్లాడుకోవటం ప్రారంభించారు. రామారావుకు మొదట ఆమెమీద సానుభూతీ, దయా మాత్రమే వుండేవి. కొద్దికాలంలోనే అవి ప్రేమగా పరిణయమించాయి.

"రామారావు పరిచయంతో ఆమెలో నిద్రపోయిన చైతన్యం చిన్నగా ఒళ్లు విరుచు కుంటూ మేల్కొంటున్నది. రామారావు ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటానని నాతో చెప్పినప్పుడు చాలా సంతోషించాను. కాని జీవితంలో కోరిందల్లా జరిగిపోతుంటే ఒక విధంగా అది జీవితమే కాదేమో!

"ఒకరోజు నిద్రలో ఏడుపులు, అరుపులూ విని ఉలిక్కిపడి లేచాను. లలిత తండ్రి ఆమెను తాడు తీసుకొని కొడుతున్నాడు. ఆమె పెద్దగా ఏడుస్తూంది. 'నంగనాచీ చీర నడివీధిలోనట. ఎంత మెత్తగా వుండి గుండెలు తీసిన పని చేస్తున్నావే? వాణ్ణి చూసిన మొదటిరోజే అనుకున్నా... వాడి దొంగచూపులూ వాడూను. అందుకే నెత్తిన నోరు పెట్టుకు చెపుతూనే వున్నా- వాళ్ళను ఈ ఇల్లు ఖాళీ చేయించమని...' ఇలా ఏమేమో అంటున్నది కమల. నాకు విషయం కొంత అర్థమైంది.

"రామారావు గదిలో దిగాలుపడి కూర్చున్నాడు. మధ్యాహ్నం అంతా నిద్రపోతున్నారు గదా అని లలిత మా ఇంటికి వచ్చిందట. ఆరోజు నాకు ఎప్పుడూ లేని నిద్ర వచ్చిపడింది. వాళ్లిద్దరూ కూర్చొని ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారట. ఇది ఎలా పసిగట్టిందో కమల, ఇంకేముంది? కొంప మునిగిపోయినంత అల్లరి చేసి వదిలింది.

"వ్యవహారం బెడిసికొట్టింది. ఏం చేయటానికి తోచలేదు. రెండవరోజు ఉదయానికల్లా ఇల్లు ఖాళీచేసి మా ఊరు వెళ్లవలసి వచ్చింది. ఆ సంవత్సరమే నాకు మద్రాసుకు బదిలీ కావడంవల్ల మళ్ళీ కుంభకోణం పోవాల్సిన అవసరం కలుగలేదు. అంతే. ఆ తరువాత చాలాకాలం వరకూ ఆమెను గురించి మాకేమీ తెలియదు. ఒక రకంగా నేనూ, రామారావూ కూడా లలితను మరిచిపోయామనే చెప్పాలి."

అంతవరకూ గుక్క తిప్పుకోకుండా చెప్పి ఆగిన మా వార్డెను ముఖంలోకి ఆదు ర్దాగా చూశాను. కొంచెంసేపు మౌనంగా వుండి మళ్ళీ ప్రారంభించింది- "ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు వాళ్ల అన్నతోసహా ఈ హాస్టల్లోనే చూశాను. ఆమెను చూస్తూనే మొదటికంటే ఘోరంగా వికృతిని పొందిన ఆమె ప్రకృతిని అర్థం చేసుకున్నాను.

"తరువాత వాళ్ల అన్నద్వారా తెలిసిన విషయమిది. ఆ వెంటనే అంటే, మేము ఇల్లు ఖాళీ చేసిన వెంటనే, లలితకు పెళ్లి చేశారట. ఆమె సవతితల్లి దూరపు బంధు వొకడు యాభయ్యోపడిలో పడ్డవాడికి ఇచ్చారట. అప్పటికి అతను ఇద్దరు భార్యల్ని మింగి

కూర్చున్నాడట. మూడుముళ్లూ వేసి ఆమెను అత్తవారింటికి పంపి, తల చిక్కుదీసినట్లు ఒక తృప్తితో కూడిన నిట్టూర్పు విడిచివుంటారా తల్లీ, తండ్రీ.

"తరువాత ఆరు నెలలకు అమెరికానుంచి వచ్చి అన్న, చెల్లెలి పెండ్లి విషయం విని ఏడ్చాడట. ఆరోజు ఇంట్లో పచ్చి మంచినీళ్లయినా ముట్టకుండా లలిత అత్తవారింటికి బయలుదేరాడు. ఆ గ్రామం చేరుకొనేప్పటికి బాగా ప్రొద్దుపోయింది. వాళ్లనీ, వీళ్లనీ వాకబు చేస్తూ ఇల్లు చేరుకున్నాడు.

"ఇంటిముందు ఒక భీకరదృశ్యం ప్రత్యక్షమైంది. పిల్లలూ, పెద్దలూ, ఆడవాళ్లూ, మగవాళ్లూ గుమిగూడివున్నారు. ఒక పురుషుడు ఒక స్త్రీని జుట్టు పట్టుకొని బరబర బయటకు ఈడుస్తున్నాడు. స్త్రీజాతిమీద జరిగే పురుషుల దౌర్జన్యాన్ని చూస్తున్న అతని రక్తం ఆవేశంతో వురకలు తీస్తూంది. జనాన్ని నెట్టుకుంటూ ముందుకుపోయాడు.

"ఆ! ఎవరామె? తన చెల్లి! మరి ముసలివాడో? తన బావమరిదా? ఒక్క ఊపులో పోయి ఆ పురుష సింహుని మెడ పట్టుకొని ముందుకు తోశాడు. అతడు పోయి దూరంగా బొక్కబోర్లా పడ్డాడు. అంతవరకూ వాకిట్లో నిల్చొని కొడుకు ప్రతాపాన్ని తృప్తిగా చూస్తున్న అతని ముసలితల్లీ, ఇంకా మొదటి భార్య తాలూకు ఒక పిల్లా, రెండో భార్య తాలూకు ముగ్గురు పిల్లలూ 'గీ-బా'మంటూ ఏడుస్తున్నారు. చుట్టూ మూగిన జనం నాటకంలోని అంతర్నాటకాన్ని వింతగా చూస్తున్నారు.

"చెల్లెలు అన్నను గుర్తు పట్టింది. అన్నను అమాంతంగా కౌగిలించుకొని ఏడ్చింది పసిపిల్లలాగ. అక్కడ ఒక క్షణంకూడా నిల్చోకుండా చెల్లెలి చెయ్యి పట్టుకొని స్టేషన్‌వైపు బయలుదేరాడు. అతనిలో మాట్లాడటానికి శక్తిలేదు. ఆలోచించటానికి అంతకుముందే లేదు. రక్తం నరనరంలో ఘోష పెడుతూ ప్రవహిస్తూంది. తల్లినీ, తండ్రినీ ముక్కలు ముక్కలుగాచేసి కాకులకు, గద్దలకూ వేయాలనిపిస్తున్నది.

"ఇంటికి తీసుకొచ్చిన తరువాత అన్న చెల్లెలికి నీడలాగ వుంటూ ఆమె ఎండి పోయిన గుండెను స్నేహసిక్తం చేయాలని ప్రయత్నించాడు. అన్న ప్రేమ ఆ మండుటెడారిలో ఆవిరైపోయిందే కాని తేమను పుట్టించలేకపోయింది.

"చివరికి మద్రాసు మెట్రిక్ చదివించడానికి తీసుకునివచ్చాడు. నన్ను ఇక్కడ చూసి చాలా సంతోషించాడు. తన చెల్లెలి చితికిపోయిన జీవితానికి ఒక రూపాన్ని కల్పించమని నా చేతిలో పెట్టిపోయాడు. ఆ తరువాత విషయమంతా మీకు తెలిసిందేగా?"

నా కండ్ల వెంట నీరు కారుతూంది. గుండె బరువెక్కింది. ఉండబట్టలేక అడిగాను. "ఇక ఆమె జీవితం అలా పోవలసిందేనా? మార్పు తేవడానికి ఉపాయమే లేదా?"

"ఒకసారి పగిలిన అద్దాన్ని మళ్లీ సరిచేయలేము. ఆ ముక్కలన్నీ జాగ్రత్తగా చేర్చి ఆ అద్దానికి ఒక రూపాన్ని కల్పించినా, దాంట్లో మొదటి కాంతీ, నిర్మలత్వమూ రావు. బింబం మసగ్గా వుంటుంది. అలాగే ఆమె చితికిన హృదయానికి ఒక రూపాన్ని కల్పించవచ్చు. దానికి ప్రేమా, సానుభూతీ అవసరం. ఆమె హృదయం ప్రేమించలేదు కానీ ప్రేమను స్వీకరించగలదు. ఇతరులను ఆదరించి గౌరవించలేదు. కాని ఆదర గౌరవాలను స్వీకరించగలదు. ఆమె దోషాలను ప్రేమతో, సానుభూతితో చూసేవారు కావాలి" అంటూ మా వార్డెను నా వంక ప్రశ్నార్థకంగా చూసింది.

గంట క్రితమే మా ప్రవర్తనను తలుచుకొని సిగ్గుపడ్డాము. ఆమె దగ్గర క్షమాపణలు

చెప్పుకొని బరువెక్కిన శరీరాలతో బయటపడ్డాము. ఆ రాత్రి నాకు ఆ రూములోకి వెళ్లటానికే ధైర్యం చాలలా. ఆ రాత్రి నేనుకూడా మా స్నేహితుల రూములోనే పడుకున్నాను. ఇకనుండి ఆమెతో మేమెలా ప్రవర్తించాలో మాట్లాడుకుంటూ ఏ మూడుగంటలకో నిద్రపోయాము.

✿ ✿ ✿

రెండవరోజు ఎనిమిది గంటలైనా లలిత ముసుగు తీయలేదు. నేను దగ్గర కూర్చొని చిన్నగా ముసుగు తొలగించి లేవబోయాను.

శరీరం మండిపోతూంది వడ్లగింజలు పేలాలయేలా. కళ్లు తెరచి చూస్తుంది కాని నన్ను కాదు... ఎవర్నో... ఎక్కడో... ఏదో పలవరిస్తున్నది కూడా. కళ్లు చింతనిప్పుల్లాగ ఎర్రగా వున్నాయి.

నాకు భయమేసి మా వార్డెన్ను పిల్చుకొని వచ్చాను. వెంటనే హాస్పిటలుకు తీసుకెళ్లాము. వారం రోజులు లలిత హాస్పిటల్లో వున్నా మన ప్రపంచంలోకి రాలేదు. నేను ఆ వారం రోజులూ ఆమె బెడ్ ప్రక్కనే వున్నాను. ఒక్కసారి నన్ను గుర్తుపట్టగలిగితే ఎంత బావుండునూ, నేను క్షమాపణ వేడుకుందును! అని ఆలోచించేదాన్ని. కానీ ఈ వారం రోజుల్లో ఒక్క క్షణకాలం కూడా తన ప్రపంచాన్ని వదలి ఈ ప్రపంచంలోకి రాలేదు. అవును. ఎందుకు రావాలి? ఈ ప్రపంచం తనకిచ్చిన ఆనందం ఏమిటి? తనకు ఇచ్చిందల్లా తిరస్కారం, అవమానం, దుఃఖం... అంతేగా?

కళ్లు తెరిచి నేరుగా చూస్తూ ఏదో పలవరిస్తూ వుండేది అస్పష్టంగా. మధ్య మధ్య కొన్ని శబ్దాలు మాత్రం స్పష్టంగా వినిపించేవి. “అమ్మా, ‘నన్నుకూడా దొంగ... అందరూ అసహ్యించు...” ఇలాగే ఎన్నో శబ్దాలు వినిపించేవి.

ఆ దృశ్యాన్ని చూస్తున్న మా అందరి హృదయాలూ బాధతో మూలిగేవి.

వాళ్ల అన్న చెల్లెలి ముందుకు రాకుండా ఏడ్చేవాడు. తల్లి రాలేదు కాని తండ్రి వచ్చాడు. ఎంత కాదన్నా కన్నకడుపేగా పాపం! చాలా ఏడ్చాడు.

ఏడవరోజు ఉదయం అగ్నిపర్వతంలోని జ్వాలలు ఆరిపోయాయి. లలిత దొంగచూపులూ, బెదురుచూపులూ శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాయి.

ఇంక వాటిని ఎవరూ అసహ్యించుకోరు. అపస్వరాలు తప్ప పలకని ఆమె హృదయతంత్రుల్లో నిస్తబ్దత గూడు కట్టుకున్నది. ఇంక ఆ అపస్వరం తాలూకు కఠోరశబ్దం ఎవరినీ బాధపెట్టదు!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 29.4.1953)